మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట



## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్**




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట, మే 20 ప్రభాతవార్త :** మంగళవారం జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి సమావేశం ఎస్పీ యోగేష్ గౌతంతో కలిసి సమీక్షించారు. జూన్2న జరిగే అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్, మున్సిపల్ కమీషనర్ వారు ఏర్పాట్లను పర్యవేక్షించాలని సిపిఓ స్పీచ్‌కు సంబంధించిన వాటిని చూడాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు డీఈవో ఆధ్వర్యంలో నిర్వహించాలని మైక్ ఇతర సదుపాయాలు డిపిఆర్ఓ నిర్వహించాలన్నారు. డిఎంహెచ్ఓ వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఫైర్ ఇతర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జూన్ 2న పరేడ్ గ్రౌండ్‌లో అవతరణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బార్కెట్లు ఇతర పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ లింగయ్య జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న పనులు భూసేకరణ పూర్తి చేయాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ సంతోష్ అదేశాలు**



అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే 20,ప్రభాతవార్త:** జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శ్రీమంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో పెండింగ్ ఆయకట్టు భూ సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న 480 ఎకరాల భూసేకరణపై చర్యలు తక్షణమే ప్రారంభించాలని సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ వారీగా తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), మండల సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో కూడిన ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి భూ సేకరణను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు.భూమికి పరిహారం చెల్లించిన వెంటనే సివిల్ వర్క్స్ ప్రారంభించాలని స్పష్టం చేశారు.కాలువల నిర్మాణం వల్ల గ్రామాల అభివృద్ధి,సాగు సౌకర్యాలు ఎలా మెరుగవుతాయో ప్రజలకు వివరించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ ప్రాంతాలను స్వయంగా పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ,ఆర్డీఓ శ్రీనివాసరావు,ఇరిగేషన్ ఎస్.ఈ రహీముద్దీన్,ఇరిగేషన్,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు : కలెక్టర్



మిల్లులో వరి ధాన్యం నిల్వ బస్తాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**ఆత్మకూర్ మే 20 ప్రభాతవార్త:**ఆత్మకూర్ వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి హెచ్చరించారు. మంగళవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఆగ్రోటెక్ గోదాము మరియు రైసుమిల్లర్లను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి రైతులు తెచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి కాకుండా రైతుల తెచ్చిన వెంటనే కొనుగోలు చేసుకుని వెంటనే రైతులను పంపించివేయాలని ఆయన సూచించారు లక్ష్మీ ఆగ్రోటెక్ రైస్ మిల్లు ముందు దాదాపు 8 వాహనాలలో రైతులు తెచ్చిన వరి ధాన్యం తూకాలు చేయకుండా నిలిపివేయడంతో కలెక్టర్ రైస్ మిల్లర్ రమేష్ ను సున్నితంగా హెచ్చరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేసిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు ఎలాంటి ఆటంకాలు కలిగించకుండా మరి ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన సూచించారు అంతేకాకుండా ఆత్మకూరు మండలంలో పలు రైస్ మిల్లర్లు తరుగు పేరిట క్వింటాలకు నాలుగు కిలోలు చొప్పున అదనంగా వసూలు చేస్తున్న విషయాన్ని కలెక్టర్ ప్రస్తావిస్తూ అలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు కలెక్టర్ వెంబడి ఆత్మకూర్ తాసిల్దార్ రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కోచింగ్ ఇప్పించి.. మెటీరియల్ అందజేసి..

**ఉత్తమ ఫలితాలు సాధించాలంటూ ఆల్ ది బెస్ట్ చెప్పిన ఎమ్మెల్యే**

**సొంత నిధులతో ఎస్సై, కానిస్టేబుల్, విఆర్ఓ పోటీ పరీక్షల శిక్షణ**



ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డితో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు

## గోషామహల్ ఏసీపీగా సుదర్శన్



సుదర్శన్‌ను సన్మానిస్తున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ క్రైమ్, మే 20 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో వర్టికల్ డీఎస్పీ సుదర్శన్‌కు వీడుకోలు సమావేశం నిర్వహించారు. జిల్లాఎస్పీ డి.జానకి ముఖ్య సుదర్శన్‌కు శాలువ కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది మార్చి నుంచి మహబూబ్‌నగర్‌జిల్లా డీసీఆర్‌బీ విభాగంలో వర్టికల్ డీఎస్పీగా విశేషంగా సేవలందించిన సుదర్శన్ ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా హైదరాబాద్ నగరంలోని గోషామహల్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగ ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ "సుదర్శన్ తన విధు ల్లో అంకితభావంతో, పట్టుదలతో పనిచేసిన ఒక ఆదర్శ పోలీసు అధికారి అని,మహబూబ్‌నగర్ జిల్లాపోలీసు వ్యవస్థకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమైనవిగా నిలుస్తాయన్నారు.ఆయన భవిష్యత్తు బాధ్యతల్లోనూ మరింత విజయాలు సాధించాలని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి,ఆర్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

## బోనస్ తెచ్చిన మార్పు..





కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**సర్కారు తీసుకుంటున్న చర్యలతో వరి దిగుబడి క్రమంగా పెరుగుతూ వస్తున్నది. గత ఏడాది కంటే కూడా ఈసారి ధాన్యం కొనుగోళ్లు పెరగడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బోనస్ పథకం రైతులకు మరింత లాభం చేకూర్చుతున్నది. క్వింటాలుకు రూ.500బోనస్ ప్రకటించడంతో పెద్ద ఎత్తున పంట సాగు పెరిగినట్లు తెలుస్తున్నది. గతం కంటే 6.5 రెట్లు వేగవంతంగా రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశారు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఇప్పటికే రూ.42 కోట్లు బోనస్ రూపంలో రైతుల ఖాతాలో జమ అయ్యాయి. 100క్వింటాళ్లు పండించిన రైతులకు రూ.50వేలు బోనస్ రూపంలోనే వస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

***మహబూబ్‌నగర్ బ్యూరో, మే20, ప్రభాతవార్త :***

- మహబూబ్‌నగర్ జిల్లాలో 1,24,890 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు
- 17,587 మంది రైతులకు రూ.212.60 కోట్ల చెల్లింపులు
- గతేడాదికంటే 6.5రెట్లు వేగవంతం
- బోనస్ పేరుతో రూ.42.88 కోట్లు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్నఅన్నదాతలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా వడ్ల కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్నది, రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేలా సర్కారు చర్యలు తీసుకుంటున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో యాసంగి మార్కెటింగ్ సీజన్ మే 20 నాటికి 2023-24లో 110 కొనుగోలు కేంద్రాల ద్వారా 19052 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుత సంవత్సరం 192 కొనుగోలు కేంద్రాల ద్వారా 23,410 మంది రైతుల నుంచి 289.75 కోట్ల విలువ గల లక్షా 24వేల 890 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి 17 వేల 587 మంది రైతులకు 212 కోట్ల 60 లక్షల చెల్లింపులు పూర్తి చేసినట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తున్నది. మిగిలినవి కూడా 2 రోజులలో చెల్లింపులు జరిపేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మే 20 నాటికి గతం కంటే 6.5 రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యంలో రైతులకు వడ్ల డబ్బులు సకాలంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడంతో పెద్ద ఎత్తున పంట సాగు జరిగిందని అన్నారు. పండించిన వడ్లను దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా చెల్లింపు తో లబ్ధి పొందుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన లక్షా 24 వేల 890 మెట్రిక్ టన్నుల ధాన్యంలో సన్న రకం ధాన్యం 85వేల760 మెట్రిక్ టన్నుల ఉందని, వీటికి ఇప్పటి వరకు రైతులకు 42.88 కోట్ల రూపాయల బోనస్ ప్రభుత్వం త్వరలో చెల్లించనున్నట్లు తెలుస్తున్నది. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను పరీక్షించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోనీ రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కోసం గన్నీ బ్యాగ్స్ అవసరానికి అనుగుణంగా బస్తాలను కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచారు. రాబోయే 15 రోజుల్లో మిగిలిన ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించే కార్యాచరణ ను రూపొందించారు. వర్షాల వలన ధాన్యం ఎక్కడ పాడవకుండా మార్కెటింగ్ శాఖ ద్వారా అవసరమైన టార్పాలిన్ కవర్లను పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో వడగండ్లతో కూడిన అకాల వర్షాలు పడే అవకాశం ఉండడంతో ధాన్యం తడవకుండా సురక్షితంగా నిల్వ చేసేందుకు కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### బోనస్ రూ.51వేలు వచ్చింది..



నా పేరు మండడి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి. మాది షేర్‌పల్లి (హెచ్). నాలుగున్నర ఎకరాల్లో వరి పండించా. 110 క్వింటాళ్ల ధాన్యం పండింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో వడ్లను అమ్మాను. విక్రయించిన మూడు రోజుల్లోనే నా ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. వానాకాలంలో 102క్వింటాళ్లకు అమ్మిన వడ్లకు బోనస్ కింద రూ.51 వేయి వచ్చింది. ఇప్పుడు 110క్వింటాళ్ల అమ్మాను. నాకు రూ.55వేల బోనస్ వస్తది. గతంలో వడ్లు విక్రయించిన 15,20రోజులకు డబ్బులు పడుతుండే. బోనస్ కూడా లేకుండే. రైతుబంధు కంటే కూడా బోనస్ పేరుతో ఎక్కువ డబ్బులు వస్తున్నాయి. చాలా సంతోషంగా ఉన్నది.

– ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యువరైతు, షేర్‌పల్లి

### రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. చివరి గింజ వరకు పంటను కొంటాం. జిల్లాలోనీ రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. కొనుగోళ్ల కోసం 47.5 లక్షల గన్నీ బ్యాగ్స్ అవసరం ఉండగా ఇప్పటికే 39.50 లక్షల బస్తాలను కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచాం. మిగిలిన బస్తాలను కూడా గోదాముల్లో సిద్ధంగా ఉంచుతాం. రాబోయే 15రోజుల్లో మిగిలిన ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించే కార్యాచరణ ను రూపొందించాం.

– జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

## ప్రజా పాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

- మహిళా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతున్న సర్కార్..
- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో ఇందిరమ్మ రాజ్యం
- రాష్ట్రంలో 43వేల మందికి కుట్టు మిషనులు
- ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మే 20 ప్రభాతవార్త:**ప్రజా పాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో ఇందిరమ్మ రాజ్యం మళ్లీ వచ్చిందని, మహిళా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు. మంగళవారం కల్వకుర్తి మార్కండేయ భవనంలో నిర్వహించిన ఇందిరమ్మ మైనారిటీ మహిళ శక్తి పథకం, రేవంతన్న భరోసా పథకాల్లో భాగంగా మైనారిటీ మహిళలకు 150 కుట్టు మిషన్లలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ఇందిరమ్మ మైనారిటీ మహిళ శక్తి పథకంతో ఆర్థిక సాధికారత సాధిస్తామని అన్నారు. రాష్ట్రంలో 43 వేల మందికి కుట్టు మిషనులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. 12,600 కోత్తి గిరిజన సంక్షేమానికి గిరి సౌర జల వికాస్ ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. యువతకు ఆర్థిక సాధికారత కోసం 6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసమని ఆయన అన్నారు.గత కేసీఆర్‌పాలనలో మైనారిటీ సంక్షేమం గాలికొదిలారని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కాంగ్రెస్ కృషి చేస్తుందని అన్నారు. ప్రతి మండలానికి సమీకృత గురుకులాలు పాఠశాలను ఏర్పాటు చేసి 2600 మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు.

**మహిళలు, మైనార్టీలకు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట :ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, మైనార్టీలకు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక సాధికారత లక్ష్యంగా సర్కారు ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. మహిళలు మైనారిటీ సంక్షేమ ధ్యేయంగా సర్కారు ముందుకు సాగుతుందని అన్నారు. నియోజకవర్గంలో 750 కుట్టు మిషనులను మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుళ్ళ కొత్వాల్ సహకారంతో మంజూరు చేయించామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదలకు బడుగు వర్గాల సంక్షేమం కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించిందని అన్నారు.మహిళలకు బస్సులో ఉచితప్రయాణం కల్పించిందని ఎమ్మెల్యే అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మున్సిపాలిటీలో మొదటి విడతగా కల్వకుర్తి పట్టణంలో 500 ఇండ్లు మంజూరు అయ్యాయనీ పేర్కొన్నారు.గతంలో అభివృద్ధి చేయలేకపోయిన.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి పేర్కొన్నారు.మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు చేశామని

## గొంతు నులిమి.. సంపులో పడేసి..

- కూతురును కడతేర్చిన కసాయి తల్లి
- గతంలోనూ భర్తను కొట్టి చంపిన వైనం
- నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో ఘటన



తల్లి ఎల్లమ్మ, మృతి చెందిన నవీత(అమ్ములు)

**లింగాల, మే 20 ప్రభాతవార్త:** నీటి సంపులో వేసి కన్న కూతురును కడతేర్చిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ కథనం మేరకు.. లింగాల మండలంలోని చెన్నంపల్లి గ్రామానికి చెందిన మేకల రాములు,ఎల్లమ్మ దంపతులకు రెండవ కూతురు నవీత(అమ్ములు)(6). గత ఐదు నెలల క్రితం తన భర్త మేకల రాములును కుటుంబ కలహాలతో భార్య ఎల్లమ్మ గొడ్డలి, రోకలితో కొట్టి చంపింది. ఇట్టి విషయంపై ఎల్లమ్మ రెండు నెలల కిందట జైలుకు వెళ్లి బెయిల్ పై తిరిగి వచ్చింది. బెయిల్ పై తిరిగి వచ్చిన ఎల్లమ్మ,తన అత్త మాసమ్మను, ఆమె మరిది అయిన కురుమయ్యలను తనపై కేసు పెడతారా అని ప్రతి నిత్యం తిడుతూ గొడవ పడుతూ –మిగతా2లో..

## పునరావాస పనులు వేగవంతం చేయాలి

## భూసేకరణ పూర్తి చేయాలి

**ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి.రవి నాయక్ ఆదేశం**

**ఉమ్మడి జిల్లా అధికారులతో ప్రాజెక్టులపై సమీక్ష**



ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి జి.రవినాయక్, చిత్రంలో కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 20 ప్రభాతవార్త:** జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్ట్‌లు, ఎత్తి పోతల పథకాల భూ సేకరణ, పునరావాస పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి (స్పెషల్ ఆఫీసర్) జి.రవి నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (కలెక్టరేట్)లోని విసి హాల్‌లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండపూర్ రిజర్వాయర్ నిర్మాణం భూ సేకరణ,ఆర్ఆర్ పనులను,కోయిల్‌సాగర్,మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకాల భూ సేకరణపై ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, మిషన్ భగీరథ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఉదండపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా జడ్చర్ల మండలంలోని వల్లూర్, ఉదండపూర్, తుమ్మల కుంట తండా, రేగడి పట్టి తండా, చిన్న గుట్ట తండా, ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా లు ముంపునకు గురవుతున్నట్లు అధికారులు వివరించారు.జడ్చర్ల మండలంలోని ఖానాపూర్, ఉదండపూర్,వల్లూరు,పోలేపల్లి,కిస్టారంరెవెన్యూ గ్రామాలు,నవాబ్‌పేట మండలంలోని తీగలపల్లి, కార్‌కొండ, సిద్ధోటం రెవెన్యూ గ్రామాల్లో 4887.035 ఎకరాల వ్యవసాయ భూముల భూ సేకరణకుగాను 4876.185ఎకరాలు భూ సేకరణ చేసిన ట్లు, ఉదండపూర్ రెవెన్యూ గ్రామంలో 1453.33 ఎకరాలకు గాను 1443.09 ఎకరాలు సేకరించినట్లు, 10.24 ఎకరాలు భూసేకరణ చేయవలసి ఉందని వివరించారు. వల్లూర్,ఉదండ పూర్,తుమ్మలకుంట తండా,రేగడి పట్టి తండా, చిన్న గుట్ట తండా, ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా ,పోలేపల్లి ఆవాస ప్రాంతాల్లో 1954 గృహాలు 60 ఎకరాల 26గుంటలు సేకరణకు నోటిఫై చేసినట్లు తెలిపారు.667గృహాలకు అవార్డ్ పాస్ చేసినట్లు, 510 గృహాలకు టోకెన్‌లు జనరేట్ చేసినట్లు, ఇంకా బ్యాలెన్స్ 161గృహాలకు టోకెన్‌లు జనరేట్ చేయ వలసి ఉందని తెలిపారు. ఆర్ ఆర్ కింద తుమ్మల కుంట తండా ,రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా, శామగడ్డ తండా,ఒంటి గుడిసె తండా, పోలేపల్లి నిర్వాసిత కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించినట్లు తెలిపారు. జడ్చర్ల మండలంలోని వల్లూర్, ఉదండ పూర్, తుమ్మలకుంట తండా, రేగడి పట్టి తండా, చిన్న గుట్ట తండా,ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా, పోలేపల్లి గ్రామాల నిర్వాసితులకు జడ్చర్ల మండలంలోని పోలేపల్లిలో 125.13ఎకరాలను, జడ్చర్ల లో 149.19 ఎకరాలు మొత్తం 274.32 ఎకరాలను పునరావాస కాలనీలుగా (ఆర్ ఆర్ సెంటర్) ప్రతి పాదించినట్లు తెలిపారు. పనులు ప్రగతి లో ఉన్నవని తెలిపారు.ఆర్ఆర్ లొకేషన్ 1,2లలో మౌలిక వసతుల పనులు చేపట్టి నట్లు తెలిపారు. లొకేషన్ 1 లో లాండ్ లెవెలింగ్, సైడ్ డ్రైన్ లు,ప్లాట్‌ల లెవెలింగ్, ప్లాట్‌ల గుర్తింపు నంబరింగ్‌తో స్టోన్ వేయటం, విద్యుత్ పనులు పూర్తి చేసినట్లు, అంతర్గత రహదారుల పనులు ప్రగతిలో –మిగతా2లో..

## స్పోర్ట్స్‌యూనివర్సిటీ ఏర్పాటు

- క్రీడల్లో ఆణిముత్యాలను బయటకు తెస్తాం
- పిసిసి ఉపాధ్యక్షులు, టీజీఎంఎఫ్‌సి చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్
- ఉత్సాహంగా అండర్ 23 టూడే లీగ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కొత్వాల్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 20 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు పిసిసి ఉపాధ్యక్షుడు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో జరుగుతున్న అండర్23 పురుషుల ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ రెండో రోజు మంగళవారం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాటాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం క్రీడల అబివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. క్రికెట్ –మిగతా2లో..

## ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

**మానవపాడు, మే 20 ప్రభాతవార్త :** మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులకు నూతన విధానంలో బోధన చేయాలని శిక్షణ డైరెక్టర్ ఎంఈఓ శివ ప్రసాద్ అన్నారు. మంగళవారం అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మానవపాడు, ఉండవల్లి మండలాలకు చెందిన దాదాపు 251 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ డైరెక్టర్ ఎంఈఓ శివప్రసాద్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమాలు శాఖపరమైన పనితీరు మెరుగుపరచుకోవడంతో పాటు విద్యార్థుల అవగాహన నేర్చుకునే సామర్థ్యాలను మరింత సులభతరం చేసేలా బోధన విధానాలు నేర్చుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈనెల 24న శనివారం వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. బోధన మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా విద్యార్థులకు బోధించాల్సి ఉంటుందని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించుటకు కోసం ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ద్వారా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి ఎంఈఓ రామకృష్ణ, ఉపాధ్యాయులు రిసోర్స్ పర్సన్‌లు ఎమ్మార్పీలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక కర్షకుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి




ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాయకులు

**దేవరకద్ర, మే 20 ప్రభాతవార్త :** అన్ని రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వారికి కనీస వేతనాలు నెలకు రూ.29 వేల ప్రకారంగా ఇవ్వాలని రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధరలు డా. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు అమలు చేయాలి ప్రస్తుతం పార్లమెంటు సెషన్‌లో ప్రవేశపెట్టిన వ్యవసాయ మార్కెట్ రద్దు బిల్లును ఉపసంహరించుకోవాలని దేశవ్యాప్తంగా రైతాంగానికి సంపూర్ణ రుణమాఫీ అమలు చేసి రైతన్న ఆదుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక రైతాంగ సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో జరిగిన నిరసన మంగళవారం కార్యక్రమాన్ని ఉద్దేశించి అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ రామచందర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమంలో గద్వాల బాల్‌రెడ్డి, దశరథం, నాగేష్, అంజిరెడ్డి, బాలస్వామి, రాజు, నాయకుడు కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ సినీనటుడు జూ"ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు




జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ఎన్టీఆర్ ఫ్యాన్స్

**పెబ్బేరు, మే 20 ప్రభాతవార్త :** సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్టీఆర్ 42వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. అలాగే కేక్ చేసి రోగులకు బ్రెడ్ ప్యాకెట్లు అరటి పండ్లు స్వీట్స్ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ఫ్యాన్స్ మాట్లాడుతూ ఎన్టీఆర్ యాక్టింగ్, డ్యాన్స్, డైలాగులు, ఎవరెస్టు శిఖరం ఎదిగిన తారక రాముడు ఈ తరం నటుల్లో తనను కొట్టే వారే లేరని నిరూపించుకున్నాడు. నునూగు మీసాల వయసులోని స్టూడెంట్ నెంబర్ వన్, ఆది, సింహాద్రి సినిమాల్లో రికార్డులు కొల్లగొట్టాడు మధ్యలో ఫ్లాప్స్ వచ్చినా టెంపర్ మూవీతో టాలీవుడ్ టెంపర్ లేపాడు త్రిబుల్ ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్ దేశవ్యాప్తంగా బెస్ట్ యాక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బలపాల సుధాకర్, భాస్కర్ గౌడ్, బలపాల రమేష్, పెద్దిరమేష్, రాజు, మహేష్, వెంకటేశ్వర గౌడ్, కాశీం, రాముడు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

గుర్తు చేస్తూ భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మైనార్టీలకు పెద్దపీట ...రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్ల కొత్వాల్ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్ల కొత్వాల్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కల్వకుర్తిలో నిర్వహించిన మైనార్టీ మహిళలు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాలు పాల్గొని కుట్టు మిషనులు పంపిణి చేశారు. ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన మహిళలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, యెన్నం భూపతిరెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ అండ్ మోనిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు గుమ్మకొండ రాములు, నాయకులు షాన్‌వాజ్‌ఖాన్, రబ్బాని, ఎండి ఆహియయా ఖాన్, శ్రీకాంత్ రెడ్డి రమాకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, ఎంపీడీఓ వెంకటరాములు, తహసీల్దార్ ఇబ్రహీం, నాయకులు కొండల్, మసూద్, ఎజాస్, శ్రీను, శ్రీనివాస్ గౌడ్, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస పనులు వేగవంతం చేయాలి
## భూసేకరణ పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఉన్నట్లు తెలిపారు. లొకేషన్ 2లో లాండ్ లెవెలింగ్, సైడ్ డ్రైన్‌లు, ప్లాట్‌ల లెవెలింగ్, ప్లాట్‌ల గుర్తింపు నంబరింగ్ తో స్టోన్ వేయటం పనులు, విద్యుత్ పోల్‌లు 50 శాతం పైగా పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. వల్లూరు, ఉదండ పూర్ ఆర్‌ఆర్ సెంటర్‌లో పిహెచ్‌సి, అంగన్‌వాడీ, పాఠశాల భవనాలు ,గ్రామ పంచాయతీ భవనం, బస్ షెల్టర్, పంక్షన్ హాల్, కమ్యూనిటి భవనాలు పనులు, టెంపుల్ మొదలు పెట్టవలసి ఉందని అన్నారు. నిర్వాసితులను పునరావాస ఆర్‌ఆర్ సెంటర్‌లో పనులు పూర్తి చేసి ప్లాట్ లు కేటాయించాలని అన్నారు. నిర్వాసితుల కుటుంబాలకు పునరావాసంకు ఆర్‌ఆర్ సెంటర్లలో పునరావాసం కేటాయింపుకు సరిపడా ప్లాట్‌లు పోను మిగిలిన వారికి ఇంకా భూమి అవసరం ఉంటే రిక్విజిషన్ ఇచ్చి భూ సేకరణ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. కోయిల్ సాగర్, మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకాల భూ సేకరణ పనులు సమీక్షించారు. రెగ్యులర్ గా అధికారులతో పనుల ప్రగతిపై సమీక్షించనున్నట్లు తెలిపారు. అప్డేట్ సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, సాగు నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ బి.వి.రమణా రెడ్డి, ఎస్ఈ చక్రధరం, ఆర్‌డిఓ నవీన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి కిషన్ రావు, మిషన్ భగీరథ ఇంట్రా ఈ ఈ పుల్లా రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి తండాకు బీటీ రోడ్డు వేయిస్తా..

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 19, ప్రభాతవార్త:** ప్రతి తాండా కు బిటి రోడ్డు వేయిస్తానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని లాల్యానాయక్ తాండా లో 2.10 కోట్ల రూపాయల తో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణపు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి చెందాలన్నా రవాణా సౌకర్యాలు మెరుగైతేనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నో యేండ్ల ఆకాంక్ష నేడు ప్రజా ప్రభుత్వం లో సాకారం కాబోతుంది అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, నాయకులు తులసి రాం నాయక్, రాజు గౌడ్, ప్రతాప్ రెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

## ఇరిగేషన్ ప్రాజెక్టులకు భూసేకరణ

# పనులు వేగవంతం చేయాలి

**- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి. రవినాయక్**



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి. రవినాయక్

**వనపర్తి టౌన్, మే 20 ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిపోయిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి జి. రవినాయక్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే ల్యాండ్ అధికారులతో ఇరిగేషన్ భూసేకరణ అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ వర్షాకాలం వచ్చేస్తే రైతులు పంటలు వేసుకుంటారని అప్పుడు సర్వే చేయడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. అందువల్ల వారం పదిహేను రోజుల్లో మిగిలిపోయిన భూసేకరణకు సర్వే పూర్తి చేయాలని సూచించారు. సర్వే చేసేందుకు సర్వే ల్యాండ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వెళ్లి పూర్తి చేయాలని ఆదేశించారు. గోపాలపేట, బుద్ధారం, ఘనపూర్, రేవల్లి తదితర మండలాల్లో చేయాల్సిన భూసేకరణపై కూలంకషంగా చర్చించారు. రైతులను ఒప్పించి సర్వే పూర్తిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలో ఇరిగేషన్‌కు సంబంధించి భూసేకరణ సకాలంలో పూర్తిచేసి ఆయకట్టు పెంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. 15 రోజుల్లో సర్వే చేయించి అవార్డు స్టేజి కి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఎస్ఈ ఇరిగేషన్ సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, డిఈలు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ అధికారులు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులలో పోటీతత్వం పెరగాలి




స్కూల్ అభివృద్ధికి సహకరించిన శ్రీహరి రెడ్డిని సన్మానిస్తున్న డిఈఓ

**పెబ్బేరు, మే 20 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం యాపర్ల గ్రామీణ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు అన్ని రంగాలలో పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ గని అన్నారు. మంగళవారం పెబ్బేరు మండలం యాపర్ల జడ్పీ హైస్కూల్‌లో జరిగిన పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల బహుమతి ప్రధాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిఇఒ మాట్లాడుతూ నేడు ప్రభుత్వ విద్యను అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల వారికి చేరువ చేసిందని ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోని పోటీ పడుతూ ఫలితాలు సాధించాలని కోరారు. పాఠశాలకు భౌతిక వనరులు సమకూర్చడంలో యాపర్ల గ్రామస్తుల ఆర్థిక సహకారం జిల్లాకు స్ఫూర్తివంతంగా నిలిచిందని పది లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ పాఠశాల స్థాయిలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన శివాని, శివలక్ష్మి విద్యార్థులకు గ్రామ ఎన్నారై సూదిరెడ్డి శ్రీహరి రెడ్డి ఒక్కొక్కరికి దాదాపు నలభై వేల రూపాయల విలువ చేసే రెండు గ్రాముల బంగారు నాణాలు అందజేయడం ప్రశంసనీయమని డిఇఒ అబ్దుల్ గని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను గూర్చి వివరించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన విద్యార్థుల చైతన్య కళా వేదికను డిఈఓ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఈబి సెక్రటరీ సూర చంద్ర శేఖర్, ఎఎంఒ మహానంది, గ్రామ పెద్దలు నరేందర్ రెడ్డి, స్వరాజ్యం, బాబు రెడ్డి, ఉపాధ్యాయులు మైనొద్దీన్, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

**తెలకపల్లి, మే 20 ప్రభాతవార్త:** రైతులు నాణ్యమైన విత్తనాలను వాడి అధిక దిగుబడులు సాధించాలని పాలెం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ చరణ్ తేజ అన్నారు మంగళవారం మండల పరిధిలోని ఆలేరు గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి గురించి నారు మడుల గురించి పిచికారి చేసే విధానాల గురించి ఎరువుల గురించి భూసార పరీక్షల గురించి క్లుప్తంగా రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో అధికమైనటువంటి పంటల ను రాబట్టే విధంగా రైతులు కొనసాగాలని వారు సూచించారు. విత్తనాలపై పరిశోధన చేసిన విత్తనాలను మాత్రమే ఎంచుకోవాలని నాసిరకం విత్తనాలు ఎవరైనా అమ్మిన మీరు కొనుక్కున్న దానికి కచ్చితంగా రిసిప్ట్ ఆధారంగా విత్తనాలు కొనుకోవాలని వారు రైతులకు సూచించారు. ఒకసారి వేసిన విత్తనాలు మరోసారి నాటుకుంటే పంట పండదని మంచి స్పష్టమైన మొక్కలచే వచ్చిన విత్తనాలను మనమైనా విత్తన శుద్ధి చేసుకుని విత్తనాలు వేసుకుంటే సరైనటువంటి పంట పండే అవకాశం ఉంటుందని సూచించారు. దళారి వ్యాపారస్తులు నాసిరకం విత్తనాలు రైతులకు అమ్మిన అధికారుల దృష్టికి తీసుకొస్తే నష్టపరిహారం చెల్లింపు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతులకు సూచన చేశారు. ప్రతి రైతు నాణ్యమైన పద్ధతిలో విత్తనాలు కొనుగోలు చేయాలి నాణ్యమైన మందులను మాత్రమే వాడాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కళాశాల సిబ్బంది వై.సాయి కావ్య, ఏఈఓ రమేష్ రెడ్డి. స్థానిక మాజీ ఎంపిటిసి జింకల ఈశ్వరయ్య, రైతులు ఏ వెంకటస్వామి, టి రాములు ,ఏ.సత్యం, జైపాల్ రావు, ధర్మవర్ధన్ రావు, మహేష్ కృష్ణ పలువురు రైతులు పాల్గొన్నారు.

## జనభేరి బహిరంగ సభను విజయవంతం చేయండి



జనభేరి బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రాచాల బృందం

**వనపర్తి క్రైమ్, మే 20 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం హక్కుల సాధనకై ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించ తలపెట్టిన జనభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం శ్రీరంగాపూర్ రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జనభేరి బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నామని, గత ప్రభుత్వంలో ఎన్నో అక్రమ కేసులు పెట్టినా కూడా వాటిని ధైర్యంగా ఎదుర్కొని అనేక ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇటీవల వనపర్తి జిల్లాలో చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. వనపర్తి జిల్లాలోని అన్ని మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు జనభేరి సభలో ప్రస్తావిస్తామన్నారు. సమగ్ర కుల గణన చేపట్టి, బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జనభేరి సభలో కృతజ్ఞతలు తెలుపుతామన్నారు. జనభేరి సభలో ప్రముఖ జానపద కళాకారులు జంగిరెడ్డి, జానులిరి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలు, మతాలు, కులాలకతీతంగా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, మండల అధ్యక్షులు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, రవి నాయుడు, బాలచంద్రయ్య, రవి సాగర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇంటర్‌లో చేరేలా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే20, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివిన వారందరూ ఇంటర్మీడియట్ లో చేరేలా చూడాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాసి పాసైన వారందరూ ఇంటర్మీడియట్లో చేరేలా చూడాలని, ఇంటర్ లో చేరేందుకు పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఫోన్ ద్వారా సంప్రదించి వారు ఏ కళాశాలలో చేరాలనుకుంటున్నారో ఆ వివరాలను తెలుసుకోవాలని అన్నారు. వ్యక్తిగతంగా విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారిని ఇంటర్మీడియట్ లో చేర్పించాలని సూచించారు. విద్యార్థుల యొక్క ఫోన్ నెంబర్ వంటి వివరాలను సంబంధిత పాఠశాలల నుండి తీసుకోవాలని సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయాలని, ఇంటర్ లో పాస్ పర్సంటేజ్ తక్కువగా వచ్చిన దాని గురించి సంబంధిత ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ లను ఎందుకు తక్కువగా వచ్చిందో తెలుసుకొని వచ్చే సంవత్సరానికి ఇంప్రూవ్ చేయాలని అన్నారు. చదవడం, రాయడం రాని విద్యార్థుల మీద మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని. కళాశాలలో స్లిప్ టెస్ట్ లు, యూనిట్ టెస్ట్ లు, స్టడీ హావర్లను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు తెలుగుతోపాటు ఇంగ్లీష్, హిందీ భాషలలో రాయడం చదవడం రావాలన్నారు. నిరక్షరాస్యులను ముఖ్యంగా మహిళలకు అక్షరాస్యులుగా మార్చడానికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లోని అక్షరాస్యులు అయిన మహిళలు, విద్యార్థులు ఉద్యోగులు ఉల్లాస్ యాప్ లో రిజిస్టర్ అయిన అనంతరం వారికి పుస్తకాలను ఇవ్వడం జరుగుతుందని. ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారి యొక్క పిల్లలు లేదా వాలంటీర్ల ద్వారా వారికి ఈ వందరోజుల కోర్స్ నేర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఉల్లాస్ అడల్ట్ ఎడ్యుకేషన్ ముఖ్య ఉద్దేశం నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేయడమే అని కలెక్టర్ తెలిపారు. రెగ్యులర్‌గా పాఠశాలకు వెళ్లడానికి వీలుకాని వారు తెలంగాణ ఓపెన్ పాఠశాల సంస్థ ద్వారా 10వతరగతి మరియు ఇంటర్ కళాశాలలో చదువుకునేందుకు ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ అడ్మిషన్ ద్వారా చేరవచ్చని తెలిపారు.

## భూ భారతి దరఖాస్తులను జూన్ 2లోగా పరిష్కరించాలి

**- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మే 20 ప్రభాతవార్త:** పైలెట్ ప్రాజెక్ట్ మండలంగా తీసుకున్న గోపాల్‌పేట మండలంలోని భూ భారతి దరఖాస్తులను జూన్ 2లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో భూ భారతిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. వనపర్తి జిల్లాలో భూ భారతి చట్టం అమలును గోపాల్ పేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని మే 5 నుండి 13 వరకు ప్రజల నుండి దరఖాస్తులు తీసుకోగా మొత్తం 573 దరఖాస్తులు వచ్చాయి. అందులో 155 సెక్సేషన్, 131 సాదా బైనామా, పెండింగ్ మ్యుటేషన్, అసైన్మెంట్ మొదలగు దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ జూన్ 2లోగా పరిష్కరించాల్సి ఉందన్నారు. తహసిల్దార్ లాగిన్‌లో పరిష్కారం అయ్యే వాటిని త్వరగా పరిష్కరించి ఆర్డీఓ లాగిన్‌కు సంబంధించి, కలెక్టర్ ద్వారా పరిష్కరించాల్సినవి కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని తహశీల్దార్లు ఆదేశించారు. జూన్ 2 నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని గ్రామాల్లో భూ భారతి చట్టం అమలు చేసేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉంటుందని అందుకు తగిన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, గోపాల్‌పేట్ తహసిల్దార్ పాండు నాయక్, రాజు సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలను దర్శించుకున్న ఎన్ఐసిడిసి సీఈఓ ఎండి



ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎన్ఐసిడిసి , సీఈఓ ,ఎండి

**అలంపూర్, మే 20 ప్రభాతవార్త :** అష్టదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను మంగళవారం రోజు ఎన్ ఐ సి డి సి, సీఈఓ మరియు ఎండి, రజత్ కుమార్ షైనీ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వీరికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా స్వామివారు ఆలయంలో అభిషేకం బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు వారికి సత్కరించారు. ఆలయాల విశిష్టతల గురించి ఆలయ అర్చకులు వారికి వివరించారు. వీరి వెంట అలంపూర్ తాసిల్దార్ మంజుల తదితరులు ఉన్నారు.

## కోచింగ్ ఇప్పించి.. మెటీరియల్ అందజేసి..

**మహబూబ్‌గర్ బ్యూరో, మే 20, ప్రభాతవార్త:** తన సొంత నిధులతో వేద విద్యార్థులకు ఉచితంగా హైదరాబాద్కు ఫ్యాకల్టీని రప్పించి పాలమూరు విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇప్పించి అందరికీ స్టడీ మెటీరియల్ సైతం అందజేసారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి. ఉచిత కోచింగ్ తీసుకున్న అందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మహబూబ్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో వివిధ పోటీ పరీక్షలకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో నిరుద్యోగ యువతకు హైదరాబాద్ ఫ్యాకల్టీ చేత ఉచిత కోచింగ్ ఇప్పించారు. ఉచిత కోచింగ్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్స్‌ను ఎమ్మెల్యే అందజేసి ఉద్యోగార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ యొక్క ఆసక్తిని చూసి చాలా సంతోషంగా ఉందన్నారు. మండుటెండలో సైతం ఎంతో శ్రద్ధగా వచ్చి తరగతులను వింటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రంలో సైతం ఎంతో మంది నిరుద్యోగ మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నామని ఆయన చెప్పారు. మేము చేసే ప్రయత్నం అంతా కూడా మీరంతా జీవితంలో స్థిరపడాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవడమే అని ఆయన స్పష్టం చేశారు. రానున్న పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జీవితంలో మీరంతా స్థిరపడాలన్నదే మా ఉద్దేశం అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## గొంతు నులిమి.. సంపులో పడేసి..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఉండేది. ఈ క్రమంలో ఇట్టి విషయాలను తన రెండవ కూతురైన నవీత(అమ్ములు) తన నాన్నమ్మ, బాబాయికి చెబుతూ ఉండేది. ఎల్లమ్మ తన విషయాలను వాళ్ల నాన్నమ్మకు, బాబాయికి చెప్పుతుందన్న కోపంతో ఎలాగైనా పాపను చంపాలన్న ఆలోచనతో సోమవారం రాత్రి నవీత(అమ్ములు) నిద్రలోకి జారుకున్న తరువాత చంపాలన్న ఉద్దేశంతో నిద్ర పోయిన నవీతను ఎత్తుకుపోయి వీరి ఇంటి ప్రక్కనే ఉన్న బోగ్గుల తిరుపతయ్య ఇంటి ముందు ఉన్న నీటి సంపులో వేసి చంపేసింది. మృతురాలి నాన్నమ్మ మాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అచ్చంపేట సిఐ రవీందర్ సమాక్షంలో పంచనామా నిర్వహించి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు.

## స్పోర్ట్స్‌యూనివర్సిటీ ఏర్పాటు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి జిల్లా క్రికెట్ సంఘం ఎంతో పాటుపడుతున్నట్లు తెలిపారు. వారి ఆధ్వర్యంలో ఈ రోజు ఎంతో మంది జిల్లా క్రీడాకారులు క్రికెట్ లో ప్రతిభ చాటుతున్నట్లు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. అనంతరం కొత్వాల్ బ్యాటింగ్ చేసిన క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, కోచ్ గోపాలకృష్ణ, సీనియర్ క్రీడాకారుడు ఆబిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

■మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి


మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి

**అమరచింత, మే 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మక్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్, వనపర్తి జిల్లా డీసీసీ అధ్యక్షులు, శంకర్ ప్రసాద్, నారాయణపేట డిసిసి అధ్యక్షులు, ప్రశాంత్ కుమార్ రెడ్డి తో కలిసి అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పాలకులు ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళలకు 500 కే ఉచిత సిలిండర్, మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు బోనస్, రైతు భరోసా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కార్యకర్తలు ఇంటి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని ఆయన కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు విడిచి కాంగ్రెస్ పార్టీ ఐక్యత కోసం వచ్చే స్థానిక ఎన్నికల్లో నాయకులు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ జెండాను గ్రామాలలో ఎగురవేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్ పార్టీలో వర్గాలు లేవని దేశంలో రాహుల్, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రెండు వర్గాలు మాత్రమే ఉన్నాయని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గుర్తించుకోవాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే పదవులు వస్తాయని పైరవీలకు తావు ఉండదని ఆయన హితువు పలికారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామ, పట్టణాలలో కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు సైనికుల పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు, ధనలక్ష్మి ృ, సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఎస్ఎం అరుణ్ కుమార్, కేజీ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మహంకాళి విష్ణు, తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే


మహిళ శక్తి క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, మే 20 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ఆకస్మికంగా అక్కడికి వెళ్లి వారితో ముచ్చటించి లాభనష్టాలు ఎలా ఉన్నాయని వంటల రుచులు చూసి వారందరితో కలిసి భోజనం చేశారు. మహిళా శక్తి క్యాంటీన్‌లో వ్యాపారాలు ఎలా కొనసాగుతున్నాయని ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే నాకు నేరుగా చెప్పి సమస్యను పరిష్కరించుకోవాలని మహిళలకు తెలియజేశారు. వండిన వంటకాలు రుచి బాగుందని ప్రశంసించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలించి రాబోయే కాలంలో క్రీడా మైదానాన్ని అభివృద్ధి పరుస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోళ్ల వెంకటేష్ రాజం పటేల్ శివరాంరెడ్డి, కట్ట వెంకటేష్, కావాలి తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## మినీ స్టేడియం అభివృద్ధి కృషి: మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి


మిని స్టేడియంను సందర్శిస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్, మే 20 ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, త్వరలోనే క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు అన్నింటిని కల్పిస్తామని మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆయన మినీ స్టేడియంను సందర్శించి స్టేడియం అభివృద్ధికి చేపట్టవలసిన పనులపై చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో మినీ స్టేడియం అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతో స్టేడియంలో క్రీడాకారులకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి స్టేడియంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పట్టణంలోని మహిళా శక్తి క్యాంటీన్ ఎమ్మెల్యే సందర్శించి స్థానిక నాయకులతో కలిసి అల్పాహారం రుచి చూశారు. అల్పాహారం రుచి, నాణ్యత చాలా బాగుందని భవిష్యత్తులోనూ ఇదే ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి, నాయకులు కోళ్ల వెంకటేష్, కావలి తాయప్ప, షాలం, రహీం పటేల్, మూర్తి, వాకిటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలను పరిశీలించిన డీఎస్పీ


సిసి కెమెరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

**నారాయణపేట, మే20 ప్రభాతవార్త:** మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో, కమాండ్ కంట్రోల్‌లోని సీసీ కెమెరాలను డిఎస్పి నల్లపు లింగయ్య పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ పోలీసులు నిరంతరం సీసీ కెమెరాలను పరిశీలిస్తూ జిల్లా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన, రోడ్డు ప్రమాదాలు, అల్లర్లు జరిగిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతిరోజు ఐటి కోర్ టీమ్ మానిటరింగ్‌తో సిసి కెమెరాలను టెక్నీషియన్లతో ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఉండడంవల్ల దొంగతనాలు చేయడానికి భయపడతారని, అసాంఘిక కార్యక్రమాలు నిర్మూలించడానికి అవకాశంఉంటుందని, నేరాలు నివారించ డానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి త్వరితగతిన ఘటన స్థలానికి చేరుకొని బాధితులకు సహాయం అందించడం జరుగుతుందని, పోలీస్ స్టేషన్లో ఉద్యోగాల పనితీరు ఎలాఉంది సమయాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు అనే విషయాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా గ్రామాలలో కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ కోరారు. డీఎస్పీతో పాటు ఎస్‌బి ఎస్ఐ నరేష్, ఐటి కోర్ పిసి శ్రీనివాసులు, కమాండ్ కంట్రోల్ టీం పాల్గొన్నారు.

## ఘనంగా నందమూరి తారక రామారావు జన్మదిన వేడుకలు


ఆసుపత్రిలో రక్త దానం చేస్తున్న అభిమానులు

**గద్వాల, మే20,ప్రభాతవార్త:** మనసున్న మహారాజు హీరో నందమూరి తారక రాముని జన్మదిన వేడుక సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు మంగళవారం చిరు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గద్వాల్ నియోజకవర్గం లోని ఎన్టీఆర్ ఫ్యాన్ అసోసియేషన్‌జిల్లా అధ్యక్షుడు చిరు ముదిరాజ్ ఆధ్వర్యంలో మా నందమూరి తారక రామారావు జన్మదినం సందర్భంగాఎన్టీఆర్ జన్మదిన పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు 300 మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 200 మంది డెలివరీ పేషెంట్స్కు, పండ్లు, మజ్జిగ, అందించడం జరిగిందన్నారు. హాస్పటల్లో రక్తం కొరత ఉందని తెలుసుకొని పలువురు ఎన్టీఆర్ సభ్యులు, రక్తదానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్. పి. ఇందిరా సూపరెంట్ గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్.ఏ. నవీన్ క్రాంతి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు చిరు ముదిరాజ్ మాట్లాడుతూఎన్టీఆర్ అభిమానులు అంటే అభిమానం లో కేవలం బ్యానర్లు ఫ్లెక్సీలు, పబ్లిసిటీలు కాదు ప్రజాసేవకు పేద ప్రజలకు అండగా నిలిచే విధంగా ఎన్టీఆర్ అభిమానులు, గద్వాలలో ఎన్టీఆర్ పేరుమీద అనేకమైన సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో జోగులాంబ గద్వాల జిల్లా లో పలు సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి ఒక్క ఎన్టీఆర్ అభిమానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్‌వీరేష్ సుభాన్ టౌన్ ప్రెసిడెంట్ రమేష్‌నవీన్ ఈశ్వర్ పరుష దిలీప్ పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో విహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడి మృతి

**నారాయణపేట, మే 20 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా విహెచ్‌పీ అధ్యక్షుడు డా. రాంబాబు బ్రెయిన్ స్ట్రోక్ తో జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రోజు మృతి చెందారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఈ మధ్యనే జిల్లా అధ్యక్షుని బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే హిందూ ధర్మ జాగరణ కార్యక్రమాలను నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. వైద్య వృత్తిలో కొనసాగుతూనే డా.రాంబాబు విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లాఅధ్యక్షులుగా గణేష్ ఉత్సవ సమితి నారాయణపేట పట్టణ అధ్యక్షులు అనునిత్యం ప్రజల కోసం పనిచేశారు. అంత్యక్రియలను బుధవారం స్వగ్రామమైన నారాయణపేట జిల్లా కేంద్రంలోనిర్వహించనున్నారు. విశ్వహిందూ పరిషత్ నారాయపేట జిల్లా అధ్యక్షులు డా.రాంబాబు మృతి పట్ల హిందూధర్మిక సంస్థల ప్రతినిధులు ఆయా పార్టీల నాయకులు, నారాయణపేట జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణంబాధాకరమని హిందూ సమాజానికిడా. రాంబాబు ఆకస్మిక మృతి తీరని లోటని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## మెగా రక్తదాన శిబిరం

**మహబూబ్‌నగర్, మే20 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ పట్టణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మీటింగ్ హాల్లో సినీనటుడు నందమూరి తారక రామారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఫెరోజ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా. లయన్ నటరాజ్ హాజరయ్యారు. ఎన్టీఆర్ అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన తల సేమియా పిల్లల ప్రాణాలు కాపాడిన వారు అవుతారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో తల సేమియా పిల్లలు 173 మంది ఉన్నారని వారికి తరచుగా రక్తం అందించవలసినఅవసరం ఉందన్నారు. ఈ శిబిరంలో మొత్తం 45 బ్లడ్ యూనిట్లు సేకరించామన్నారు. ఈ మెగా రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన జిల్లా అధ్యక్షులు ఫిరోజ్ ను ఎన్టీఆర్ అభిమానులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ముఖ్య సలహాదారులు బోయరాజు, గౌరవాధ్యక్షుడు యాదయ్యగౌడ్, సలహాదారులుడు జయప్రకాష్ ఎన్టీఆర్అభిమానులు సంతోష్, సురేందర్, లవ కుమార్, ఆర్.మహేష్, నరేష్, నవీన్, బాల, చింటూ, జాంగిర్ పాల్గొన్నారు.


రక్త దానం చేస్తున్న అభిమానులు యువకులు

## శాంతినగర్‌లో ఆపరేషన్ సింధూర్ ర్యాలీ


శాంతినగర్‌లో తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**మానవపాడు, మే20 ప్రభాతవార్త:** పాకిస్తాన్‌తో నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైనందుకు ఆర్మీ త్రివిధ దళాలకు మద్దతుగా జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ పట్టణ కేంద్రంలో మంగళవారం బీజేపీ శ్రేణులు విజయ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ నెంబర్ బండల వెంకటరాముడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గాం ప్రాంతంలో జరిగినటువంటి ఉగ్రవాదాన్ని నిరసిస్తూ భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూరపు సంఘీభావంగా భారత సైనికులకు మద్దతుగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు దీంతో భారతదేశం సత్తా ప్రపంచాన్ని దేశాలకు తెలిసిందని కొనియాడారు. పహల్గం దాడికి ప్రతీకారంగా మన దేశ సైనికులు పాకిస్తాను మీద యుద్ధం చేస్తూ ఉగ్రవాద స్థావరాలను నాశనం చేస్తూ పాకిస్థాన్ మీద విజయం సాధించడం జరిగిందన్నారు. త్రివిధ దళాలకు మద్దతుగా తాము అండగా నిలుస్తామని ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ప్రతి పౌరుడగా ఆర్మీ వారికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ సమయంలో ఆర్మీజవాన్లకు ఆత్మస్థైర్యాన్ని కల్పించేందుకు వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకు తిరంగా ర్యాలీ నిర్వహించి ఆర్మీ జవాన్లకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు వడ్డేపల్లి సూరి, గవ్వల శ్రీనివాసులు సంజీవరెడ్డి నరసింహా, వడ్డేపల్లి రాజోలి, మండల బిజెపి అధ్యక్షులు శశికుమార్, బోయ నాగరాజు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాజశేఖర్ శర్మ, తిమ్మప్ప పెద్దబాబు, రాఘవేంద్ర, రంగస్వామి శ్రీనివాసులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలు సహించేది లేదు



నిరసన తెలుపుతున్న దృశ్యం

**మక్తల్, మే20 ప్రభాతవార్త:** కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నదని, కార్మిక వ్యతిరేక విధానాలను ఏ మాత్రం సహించేది లేదని సిఐటియూ జిల్లా కో కన్వీనర్ గోవిందరాజు అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మక్తల్ పట్టణంలో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. జూలై 9న జరిగే కార్మిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుజాత, వెంకటమ్మ, అనురాధ, గోవిందమ్మ, ఇందిరా, కవిత, జమున, జ్యోతి, అంబిక, లలిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అసైన్డ్, భూదాన్ భూములకు రక్షణ కల్పించండి


ఎమ్మార్వోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**మానవపాడు, మే 20 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామపంచాయతీ శివారులోని అలంపూర్ చౌరస్తాలో ప్రభుత్వ అసైన్డ్ భూములు, భూదాన్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని అయితే ఈప్రభుత్వ భూములను కొందరు భూ అక్ర మార్కులు తప్పుడు రిజిస్ట్రేషన్ల ద్వారా పత్రాలు సృష్టించి ప్లాట్లుగా మార్చుకున్నారని భూ అక్రమార్కుల నుంచి అట్టి ప్రభుత్వ భూములను పరిరక్షించవలసిందిగా ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉండవల్లి మండల కేంద్రంలో స్థానిక తహసిల్దార్‌ను కలిసి వినతి పత్రాన్నిఅందజేశారు. పుల్లూరు గ్రామ శివారులోని సర్వే నెంబరు 256 ,257,273, 451/సి451/డి వంటిపలు సర్వే నంబర్లు కలిగిన ప్రభుత్వ అసైన్ భూదాన్ భూముల్లో కొంత మంది భూ అక్రమార్కులు కబ్జా చేసుకున్నట్లు వినతిపత్రంలో పొందుపరిచారు. అంతేకాక 451 సర్వేనెంబర్ పక్కన ప్రభుత్వ మిగులుభూమి ఉందని దాన్ని కొందరుఅక్రమంగా రిజిస్టర్ చేసుకొని అనుభవిస్తున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాంటి భూ అక్రమార్కులపై శాఖపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను పరిరక్షించవలసిందిగా ప్రజాసంఘాల నాయకులు తహసి ల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. తహసిల్దార్‌ని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ తాలూకా ఇంఛార్జి జయరాజు, డివిఎంసి నెంబర్ మణిరాజ్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

## గ్రామీణ హార్తాళ్‌లో భాగంగా నిడుగుర్తిలో నిరసన

**ఉట్కూరు, మే 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నిడుగుర్తి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నందుకు నిరసనగా దేశవ్యాప్తంగా మంగళవారం రైతు వ్యవసాయ కార్మిక సంఘాల గ్రామీణ హర్తాళ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు జోగు శంకర్, ఎం.అంజప్ప, నరసింహా, బొంబాయి వెంకటప్ప, మాల మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూలీలు 200 రోజులు పని కల్పించాలని రోజుకూలి రూ. 600/ ఇవ్వాలని బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## అర్హత లేని వారిని ఎంపిక చేస్తే చట్టపరమైన చర్యలు

◆వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి


ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**ఆత్మకూర్ మే 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అర్హత లేని వారిని ఎంపిక చేస్తే స్థానిక అధికారులు బాధ్యత వహించడమే కాకుండా చట్టపరమైన చర్యలకు గురికావాల్సి వస్తుందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి హెచ్చరించారు. మంగళవారం రోజు ఆత్మకూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల మొదటి విడత ప్రక్రియకు సంబంధించి అమరచింత ఆత్మకూర్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వివరాలను పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు అవగాహనకల్పించి తక్షణమే గ్రౌండింగ్ చేపించేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు అంతేకాకుండా రెండవ విడత ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఎలాంటి పొరపాట్లకుతావివ్వకుండా నిజమైన లబ్ధిదారులు ఎంపిక చేసే బాధ్యత అధికారులపైనే ఉందని ఆయన సూచించారు గతంలో మాదిరిగా ఒకే ఇంటి ముందు లబ్ధిదారులు ఇద్దరు ముగ్గరు ఫోటోలు దిగిన విషయాన్ని కలెక్టర్ ప్రస్తావిస్తూ అలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని లేనిపక్షంలో బాధ్యత వహించవలసిఉంటుందని కలెక్టర్ అన్నారు ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి మొదటి విడత లబ్ధిదారులు ఎంపిక పూర్తి అయిన నేపథ్యంలో ఇంటి నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి రెండవ విడతలు ఎంపిక చేయాల్సిన లబ్ధిదారులకు తగు ప్రాధాన్యత కల్పించి తక్షణమే ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి లాగిన్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చాంద్ పాషా ఎంపీడీవో శ్రీపాద మండలప్రత్యేక అధికారి శ్రీరామ్‌రెడ్డి పలువురు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు నిబద్ధత, క్రియాశీలక భాగస్వామ్యం ఎంతో అవసరం

◆ప్రాథమిక విద్యలో నాణ్యతను పెంచడమే ఎఫ్ఎల్ఎన్ లక్ష్యం ◆భూత్పూర్ మండల విద్యాధికారిణి ఉషారాణి


ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఉషారాణి

**భూత్పూర్, మే 20, ప్రభాతవార్త:** ఉపాధ్యాయులకు నిబద్ధతతో కూడిన క్రియాశీలక భాగస్వామ్యం ఎంతో అవసరమని భూత్పూర్ మండల విద్యాధికారిణి ఉషారాణి స్పష్టం చేశారు. ఫౌండేషన్ ఇన్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్)లో భాగంగా మండల ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్ పేరిట భూత్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల ఐదు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈఓ ఉషారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రాథమిక విద్యలో నాణ్యతను గణనీయంగా పెంచేందుకు ఎఫ్ఎల్ఎల్ కార్యక్రమాన్ని విజయవంతంగాను, అత్యంత ప్రధానాంశంగా అమలు చేస్తోందని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక విద్యా స్థాయిలో చదవడం, రాయడంతో పాటు గణితాన్ని అర్థం కోవడంలో బలమైన పునాదిని కల్గిఉండాలన్నదే ఎఫ్ఎల్ఎన్ ముఖ్యోద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం, ప్రాముఖ్యత వాటి అమలు తీరును ఆశించిన ఫలితాలను ఎంఈఓ ఉషారాణి ఉపాధ్యాయులకు వివరించారు. ఎఫ్ఎల్ఎన్ కేవలం అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అత్యంత కీలకమైన పునాదిగా పనిచేస్తుందని తెలిపారు. ప్రాథమిక నైపుణ్యాలు పటిష్టంగా ఉంటేనే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసిస్తారని తద్వారా జీవితంలో విజయం సాధించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపుదల, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలులో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని ఎంఈఓ ఉషారాణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిలు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసులు, ఇంతియాజ్, రాజ్‌మోహన్, రేఖారాణి, పద్మనాభుడు, చంద్రశేఖర్, ఖాదరయ్య, సీఆర్‌పిలు ఇక్రమ్, ఠాగూర్, నాగేంద్రంలతో పాటు మండలంలోని పీఎస్‌ల ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## కార్మికులకు చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలి

■ప్రిన్సిపాల్ సినియర్ జడ్జి వి. శ్రీనివాస్


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సినియర్ జడ్జి వి. శ్రీనివాస్

**గద్వాల, మే 20, ప్రభాతవార్త:** అసంఘటిత రంగంలోని కార్మికులకు చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి వి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గద్వాల్ మండలంలోని మదనపల్లి గ్రామంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో అసంఘటిత రంగంలోని కార్మికుల కొరకు ఉద్దేశించిన చట్టపరమైన అవగాహన సదస్సలో ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసంఘటిత కార్మికుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసంఘటిత కార్మికుల యొక్క చట్టాల గురించి వివరించారు. అసంఘటిత రంగ కార్మికులు అంటే ప్రభుత్వంతో అధికారికంగా నమోదు కాని వ్యాపారాలలో పనిచేసే వ్యక్తులు, తరచుగా చట్టపరమైన, నియంత్రణ చట్టానికి వెలుపల పని చేస్తారు. ఈ రంగం చిన్న వ్యాపారాలు నుండిఇంటి ఆధారత పనివరకు విస్తృత శ్రేణి కార్యకలాపాలను కలిగి ఉంటుంది, ఎక్కువ మంది శ్రామిక శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులు తరచుగా తక్కువ వేతనాలు సామాజిక భద్రత లేకపోవడం, క్రమ రహిత ఉపాధి వంటి సమస్యలను కలిగి ఉంటుంది కార్మికులం దరూ లేబర్ కార్డు, ఇస్రం కార్డు ప్రతి ఒక్క కార్మికుడు కలిగి ఉండా లని అన్నారు. ఈ కార్డుల వల్ల ప్రభుత్వం యొక్క సదుపాయాలని వినియోగించుకోవచ్చు అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని మీసేవ కేంద్రం ఉపయోగించుకోవాలన్నారు. వారి యొక్క సమస్యలను దరఖాస్తు రూపంలో జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సుకు అందచేయాలని తెలియజేశారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ వి. రాజేందర్, బి. శ్రీనివాసులు, లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి


బాధితులకి చెక్కు అందజేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**మానవపాడు, మే20 ప్రభాతవార్త:** ప్రభుత్వ ప్రకారంగా అందించే సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం కర్నూల్ పట్టణంలోని ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి నివాసంలో అయిజ మండలం ఉప్పల గ్రామానికి చెందిన దొడ్ల ఎజ్ కెల్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1,75,000సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితులకి ఎమ్మెల్యే విజయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులు సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలని ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జల్లాపురం కరుణ సింహారెడ్డి, అయిజ మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నందకిశోర్ రెడ్డికి పాలమూరు రెడ్డి సేవా సమితి భరోసా

◆ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందజేసిన పాలమూరు రెడ్డిసేవా సమితి సభ్యులు



ఆర్థిక సాయం అందజేస్తున్న పాలమూరు రెడ్డి సేవా సమితి సభ్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 20 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం నందిపేట గ్రామ వాసి నందకిశోర్ రెడ్డి హైదరాబాద్‌లోరోడ్డు ప్రమాదానికి గురై కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స కోసం దాదాపు రూ. 15 లక్షలు ఖర్చవుతోందని ఆర్థిక సహాయం కోసం పాలమూరు రెడ్డి సేవా సమితిని సంప్రదించగా వెంటనే స్పందించిన పాలమూరు రెడ్డి సేవా సమితి దాతల ద్వారా సేకరించిన డబ్బులు, సొంత నిధుల నుండి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ. 1,50,000/ చెక్కును విద్యార్థి మేనమామ వెంకటేశ్వరరెడ్డికి మంగళవారం సేవా సమితి కార్యాలయంలోఅందజేయడమైనది. ఈ కార్యక్రమంలో సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనా రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రామ రెడ్డి, ప్రచార కార్యదర్శి నల్లమద్ది సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్ రెడ్డి మరియు వంశీకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందించిన దాతలందరికీ నంద కిశోర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

**ఉట్కూరు, మే20 ప్రభాతవార్త:** ఉట్కూరు మండల కేంద్రం లో మే 20 దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బందులో భాగంగా జూలై 9న వాయిదా వేయడంతో మంగళవారం మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం దగ్గర నిరసన కార్మికులు రైతు కూలీలు ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన ధర్నా చేపట్టమని ధర్నాకు ఏఐపీకే ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్కోటి చెన్నప్ప అధ్యక్షత వహించగా రైతు కార్మిక సంఘాల నాయకులు ఎఐపికెఎంఎస్ జిల్లా అధ్యక్షులు సలీమ్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు ఎఫ్ఎల రాష్ట్ర సంఘం కార్యదర్శి కాశీనాథ్, ఎఐయుకెస్ అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి. వెంకట్‌రెడ్డి, చంద్రాములు శివప్పగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కనకరాయుడు ఉన్నారు. అలాగే ఆశ వర్కర్ల మండల సంఘం నాయకులు సబిర బేగం, మంజుల, శంకర్, ఎల్లప్ప నాయకులు టియుసిఐ సీఐటీయూ జిల్లా నాయకులు కాశప్ప, నారాయణ, మాట్లాడుతూ ఎస్కేయం, కార్మిక సంఘాలు, దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా అనుసరిస్తున్న విధానాలలో కార్మికుల సవరించిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు పర్చాలనే డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వంకార్పొరేట్ శక్తులకు బాలుజాతి సంస్థలకు లొంగిపోయే తత్వాన్ని చెబుతుందని విమర్శించారు. కార్మికుల పని గంటలను పెంచడం వేతనాలు తగ్గించడం సమ్మె హక్కు ను నిర్వీర్యం చేయడం, కార్మిక కర్షక విధానాల నామాలు చేయడం ప్రజాస్వామ్ హక్కులను కాలరాస్తుందన్నారు రూ. 26,000 కొత్తపింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు రైతాంగానికి రుణాలు రద్దు చేయాలని అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని, పంటలకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు విద్యుత్తు, మార్కెటు కొత్త చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లు పనిచేసిన కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కూలీలకు కనీస వేతనం రూ. 600 రోజుకు ఇవ్వాలని పని దినాలు 200రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దారు సిబ్బందికి డిమాండ్స్‌తో కూడిన విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పోలప్ప, కృష్ణయ్య,బి. నరసింహ అంజప్ప, రాజు, కార్మికులు రైతులు కూలీలు పాల్గొన్నారు.

## కార్యదర్శులు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మణ్

**వెల్దండ, మే 20 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకమని, కార్యదర్శులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ లక్ష్మణ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండడంతోపాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అన్ని చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఇంటి బిల్లులను వసూలు చేయాలని, వర్షాకాలం నాటికి నర్సరీలో పెంచుతున్న మొక్కలను నాటడానికి సిద్ధంగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## కంపెనీ ఏర్పాటును నిలుపుదల చేయాలి



కంపెనీ ఏర్పాటు నిలుపుదల చేయాలని తహసీల్దార్‌కు వినతి

**వెల్దండ, మే 20 ప్రభాతవార్త:** మండలంలోని చెర్కూర్ గ్రామ శివారులోని 302 సర్వే నెంబర్‌లో బొక్కల కంపెనీ ఏర్పాటు చేయడానికి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు కంపెనీని ఏర్పాటు చేయకుండా నిలుపుదల చేయాలని తహసిల్దార్ కార్తీక్‌కుమార్‌కు మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గోపాల్‌నాయక్ మాట్లాడుతూ కంపెనీ ఏర్పాటు వలన దుగ్గిబండ తండా, నారాయణపూర్, పలుగు తండా, శంకరకొండ తండాల పరిధిలో గల వ్యవసాయ భూములు కలుషితమవడంతో పాటు చుట్టుపక్కల దుర్వాసన వెదజల్లుతుందని, దీని వల్ల ప్రజలు అనారోగ్యాల భారిన పడుతారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కంపెనీని ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌ను కోరారు. అదే విధంగా కంపెనీ ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాండు కిషన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కేటీఆర్‌తో పేట బిఆర్ఎస్ నాయకులు

**నారాయణపేట టౌన్, మే20 ప్రభాతవార్త :** నారాయణపేట నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు గవినోళ్ళ శ్రీనివాస్, గౌని శ్రీనివాస్‌తో పాటు తదితర నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కేటీఆర్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాల గురించి మాట్లాడారు. కేటీఆర్‌ను కలసినవారిలో భాస్కర్ రెడ్డి, నారాయణ స్వామితో బాటు ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**వెల్దండ, మే 20 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నెంట చరణ్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కేశమల్ల కృష్ణ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 34వేల చెక్కును మంగళవారం నెంట చరణ్ తండ్రి కృష్ణయ్యకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుబ్బ తాండ శ్రీనివాస్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల గోస ఎవరికి పట్టడం లేదు!

◆ కొనుగోలు కేంద్రాలలో రంగు మారి మొలకెత్తుతున్న వరి ధాన్యం

◆ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్ట్ పద్ధతే పెద్ద కుంభకోణం

◆ లారీలు లేకున్నా పైరవీలతో కాంటాక్ట్ పొందారు

◆ నెలలు గడుస్తున్న తరలించని వరి ధాన్యం

◆ బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



వరి కొనుగోలు కేంద్రం వద్ద మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాచాల

**వనపర్తి క్రైమ్, మే20 ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్ళముందే రంగు మారి మొలకెత్తుతుంటే రైతులు పడుతున్న గోస ఎవరికి పట్టడం లేదని బిసి పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం. జిల్లాలోని శ్రీరంగాపురం మండలంలో గలవరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి వరి ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరంగాపురం మండలంలో అధికారులు ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు పడుతున్న ఇబ్బందులను కళ్ళు తెరిచి చూడాలని అన్నారు. నెల రోజులకు పైగా కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని తరలించకపోవడం వల్ల ధాన్యం రంగు మారి మొలకెత్తుతుందని అన్నారు. ట్రాన్స్ పోర్టు కాంట్రాక్ట్ పద్ధతిలో లారీలు పంపిణీ చేయడం కోసం అనుమతి పొందిన వ్యక్తులతో నిజంగా లారీలు ఉంటే ఎందుకు ధాన్యం తరలించడం లేదని ప్రశ్నించారు. కేవలం తమకు ఉన్న పలుకుబడితో పైరవీలు చేసి ట్రాన్స్ పోర్టు కాంట్రాక్ట్ పొందడం వల్ల నేడు ఈ పరిస్థితి ఉత్పన్నమవుతుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. రైతుల దీనస్థితి ఏ పార్టీ నాయకుడికి పట్టడం లేదని, రైతులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారని రైతులు పండించిన ధాన్యం మొలకెత్తుతుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు కళ్ళు మూసుకున్నారా అంటూ ప్రశ్నించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా అధికార యంత్రాంగంతో చేసిన సమీక్ష సమావేశం కేవలం



వరి ధాన్యం రాశులను పరిశీలిస్తున్న రాచాల

నీటి మీద బుడగలాగే మారిందన్నారు. మంత్రి సొంత నియోజకవర్గంలోనే తరుగు పేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తుంటే పట్టించుకునే నాధుడే లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇకనైనా సివిల్ సప్లయ్ అధికారులు మొద్దునిద్ర వీడి రైతులు పడుతున్న గోసను వెంటనే తీర్చాలని, లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ తరఫున రైతులను సమీకరించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్ జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, మండల అధ్యక్షులు ధర్మేంద్ర సాగర్ ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, రవినాయుడు, బాలచంద్రయ్య, రవి సాగర్, రాధాకృష్ణ మరియు రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెలుకువలతో విద్యను అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రుడు

**వెల్దండ, మే 20 ప్రభాతవార్త:** విద్యార్థులకు మెలుకువలతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాధికారి చంద్రుడు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం ఉపాధ్యాయులతో ఎంఈఓ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంలో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించేందుకు తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో ఈనెల 20నుండి 5 రోజుల పాటు వృత్యంత శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, ఉపాధ్యాయులకు తెలుగు మౌఖిక భాషాభివృద్ధి, గణితంలో చతుర్విధ ప్రక్రియలు సాధించడం కోసం, ప్రతి విద్యార్థి సొంతంగా చదవడం, రాయడం, స్కూల్ లీడర్షిప్ మేనేజ్మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ పద్ధతిలో విద్యాబోధన మొదలగు అంశాలపైన వృత్యంతర శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. జూన్ నుంచి ప్రారంభమయ్యే పాఠశాలల్లో ఉపాధ్యాయులు మరింత అర్థవంతంగా బోధన చేసి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాస్‌రెడ్డి, శోభన్ బాబు మరియు మండల రిసోర్స్ పర్సన్‌లు రాఘవేందర్, రాజు, మోనిక, శ్రీకాంత్, మల్లికార్జున్, శ్రీనివాసులు, విష్ణువర్ధన్, ఉపేందర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ని రద్దు చేయాలి

● సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు



నిరసన తెలుపుతున్న అంగన్వాడి టీచర్లు, ఆశలు

**పెబ్బేరు, మే 20 ప్రభాతవార్త :** పెబ్బేరు మండల కేంద్రంలో కేంద్రంలోని సుభాష్ చౌక్‌లో నిరసన చేసి ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు మాట్లాడుతూ 8 గంటల పనిదినాన్ని కార్మికులు పోరాటం నిర్వహించి తెచ్చుకుంటే, నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 గంటలు పని చేయాలని నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం చేసినట్లేనని విమర్శించారు. కార్మికులకి కనీస అవసరాలని కల్పించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయని, అంగన్‌వాడి, ఆశ, మున్సిపల్, గ్రామపంచాయతీ, ఆర్‌పిలు, ఉద్యోగ భద్రత కల్పించాలని స్వతంత్రం వచ్చి77 ఏళ్ల గడిచిన నేటికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం కనీస వేతనాలు అమలు కాకపోవడం చాలా విడ్డూరంగా ఉందని ఇది నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని యొక్క అభివృద్ధికి నిదర్శనం అని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు నేటికీపుట్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఉందని హమాలీ, ఆటో కార్మికులకు బోర్డు ఏర్పాటు చేయకపోవడం సరైనది కాదని అన్నారు. వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక కూలీలకి కేరళ రాష్ట్రంలో రోజువారి కూలీ రూ. 800 ఇస్తున్న దేశంలో ఎక్కడ కూడా ఏ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు అమలు చేయడంలో విఫలమైనాయి. వ్యవసాయ కూలీలకి కనీస వేతనాలు అమలు చేయాలని ఉపాధి కూలీలకి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు దేవమ్మ, చెన్నమ్మ, సువర్ణ, గోవిందమ్మ, అంగన్వాడి యూనియన్ నాయకులు రాజేశ్వరి, నిర్మల, అలివేల, అల్లిరాణి, సిఐటియు నాయకులు మన్యం, మున్సిపల్ యూనియన్ నాయకులు రాజు, గంగన్న, రంజిత్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు హుస్సేన్, రాజేందర్, మంగమ్మ, కాశన్న పాల్గొన్నారు.

## కార్మికులు ఇ-శ్రామ్ గుర్తింపు కార్డులను కలిగి ఉండాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత





ఇ-శ్రామ్ కార్డు అందజేస్తున్న దృశ్యం

**వనపర్తి క్రైమ్, మే20 ప్రభాతవార్త:** అసంఘటిత కార్మికులు అందరూ ఇ-శ్రామ్ గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులకు ఇ-శ్రామ్ కార్డులపై అవగాహన పెంచడం కోసం కార్యక్రమం ఏర్పాటు చేసి వారికి ఇ-శ్రామ్ గుర్తింపు కార్డులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడారు. ఇ-శ్రామ్ గుర్తింపు కార్డును కలిగి ఉండడం వలన ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షల వరకు భీమా వర్తిస్తుందని అలాగే గాయాలకు గురి అయిన రూ. 50 వేల వరకు బీమా వర్తిస్తుందని తెలియజేశారు. దేశంలో ఎటువంటి అత్యవసర పరిస్థితులు ఉద్భవించి నప్పుడు వీరి ఖాతాలలో నిత్యావసరాలకు డబ్బులను జమ చేస్తారని తెలియజేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి వి. రజని మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 నెంబర్‌ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు.

## ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలి

● భారత ఎన్నికల కమిషన్ మనం వేసే ఓటుపై రూ. 1,475 ఖర్చు చేస్తుంది

● దేశ ప్రగతి బిజెపితోనే సాధ్యం

● హైదరాబాద్ కంటెస్టెడ్ ఎంపీ అభ్యర్థి మాధవిలత

**వనపర్తి ప్రతినిధి, మే 20 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని, మనం ఓటు వేసినా వేయక పోయినా ఒక్క ఓటుపై రూ. 1475 భారత ఎన్నికల కమిషన్ మనపై ఖర్చు చేస్తుందని బీజేపీ కంటెస్టెడ్ ఎంపీ అభ్యర్థి మాధవిలత పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రం బీజేపీ పార్టీ అధ్యక్షులు డి. నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వన్ నేషన్...వన్ ఎలక్షన్.. అవగాహన సదస్సుకు ముఖ్య అతిథి హైదరాబాద్ ఎంపీ కంటెస్టెడ్ సభ్యురాలు మాధవిలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోది ఇచ్చిన నినాదంతో ముందుకెళ్లి అమలు చేయడం ద్వారా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అదుపు చేసేందుకు అస్కారం ఉంటుందని తెలిపారు. భారతదేశ ప్రగతికి కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్కారుతోనే అభివృద్ధి సాధ్య మని అన్నారు. ఒక్క పర్యాయం ఎన్నికలు నిర్వహించేందుకు రూ. 3లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారని, వన్ నేషన్...వన్ ఎలక్షన్ ద్వారా ఒకేసారి దేశం మొత్తం ఎన్నికలు నిర్వహిం చడం ద్వారాదేశం పురోగమించేందుకు ఎంతో దోహదప డుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్ దాడులనునిరోధించేందుకు ఉపయోగించిన డ్రోన్, అదునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడినఆయుధ సంపత్తికి రూ. 4370 వేల కోట్లు అవుతుందని తెలిపారు. దేశంలో ఎన్నికల నిర్వహణకు ఆరున్నర లక్షల కోట్లు ఖర్చు అవుతాయన్నారు. తాను ఎంపీ ఎన్నికల లో తనకు వేసిన సుమారు మూడు లక్షల ఓట్లుకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దేశ, రాష్ట్ర సంపదను అవినీతితో దోచుకుంటున్నారని ఆరోపించారు. వక్ఫ్ చట్టం ద్వారా అసలైన ముస్లిం మైనారిటీ ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కేవలం ముస్లిం మైనారిటీలనుఓటు బ్యాంకు కోసం ఉపయోగిస్తున్నారన్నారు. ట్రిపుల్ తలాక్ నిరోధక చట్టంను కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఎందుకు మద్దతు తెలుపలేదని ప్రశ్నించారు. 2029 ఎన్నికలలో ఒక్కో సారి ఒక్కో ప్రాంతంలో ఎన్నికలు నిర్వహిస్తే దాదాపు 50 రోజులు కేంద్ర ప్రభుత్వం పథకాలు అమలు చేయడానికి ఆస్కారం ఉండదన్నారు. యువ నాయకులు, మహిళా నాయకులు రాజకీయాలలో పాల్గొనేందుకు వన్ నేషన్.. వన్ఎలక్షన్ ద్వారా వీలుంటుందన్నారు. బీజేపీ పార్టీ జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు వన్‌నేషన్.. వన్ఎలక్షన్ వల్ల ఉపయో గాలను ప్రజలచెంతకు తీసుకెళ్లాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్‌సభ్యులు అయ్యగారి ప్రభాక ర్‌రెడ్డి, సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు డి. నారాయణ, మాజీ జెడ్పిటీసీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మున్నూరు రవీంధర్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వినర్ పెద్దిరాజు, జిల్లా, మండల, గ్రామ స్థాయి మహిళ నాయ కులు, మాజీ పట్టణ అధ్యక్షులుబచ్చురాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మాధవిలత

## ధన్వాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా శంకరయ్య ఎన్నిక

**ధన్వాడ, మే20 ప్రభాతవార్త:** ధన్వాడ మండలం నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా నమస్తే తెలంగాణ విలేఖరి కె. శంకరయ్య ఎన్నికయ్యారు. బాలుర ఉన్నత పాఠశాలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల విలేఖరులు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించుకొని సీనియర్ పాత్రికేయులైన శంకరయ్యను ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఆంధ్రజ్యోతి విలేకరి అంజయ్య, సూర్య విలేకరి నీరటి శ్రీనివాస్ నాయుడు ముదిరాజులును ఎన్నుకోవడం జరిగింది. సలహాదారులుగా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా మాకం వీరేష్ కుమార్, కార్యదర్శిగా మన తెలంగాణ విలేకరి కేంచే రఘురాజ్, కోశాధికారిగా ప్రజాపక్షం విలేఖరి కొండన్న, కార్యవర్గ సభ్యులుగా వార్త విలేఖరి బాలరాజ్, ప్రశాంతులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ధన్వాడలో నూతన ప్రెస్ కార్యాలయంను త్వరలో ప్రారంభించడానికి ప్రధానంగా చర్చించడం జరిగింది.

## పేరపళ్లలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు కృషి

**నారాయణపేట టౌన్, మే20 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం పేరపళ్ల గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె. రాజ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు గాను రూ. 2.50 లక్షల చెక్కును మంగళవారం ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు హైదరాబాదులోని ఫౌండేషన్ కార్యాలయంలో రాజ్‌కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు కోసం గతంలో ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు తమను కలిసి విన్నవించారని, వారి విజ్ఞప్తి మేరకు ఛత్రపతి శివాజీ విగ్రహానికి అయ్యే రూ. 2.50లక్షలను పూర్తిగా తామే భరిస్తూ విగ్రహాన్ని ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంటి సాయికుమార్, కుంటిపాప ఆంజనేయులు, బేత్మీ నరేష్, చాకలి ఆంజనేయులు, నీరటి బాలరాజు, ఎల్లంగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

**రాజ్ కుమార్ రెడ్డి సేవలు మరువలేనివి:** నారాయణపేట జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె. రాజ్ కుమార్ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేరపళ్ల ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాయికుమార్ కొనియాడారు. పేరపళ్ల గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని రాజ్‌కుమార్ రెడ్డినికోరిన వెంటనే ఆయన సహృదయంతో స్పందిస్తూ ఛత్రపతి శివాజీ విగ్రహానికి అయ్యే రూ. 2.50 లక్షలను చెక్కు రూపంలో అందజేయడం అభినందనీయమని అన్నారు. భీష్మరాజ్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరించి ప్రజల ఆదరణ పొందాలని ఆయన కోరారు. భీష్మరాజ్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకుతమసంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## జన భేరి బహిరంగ సభను విజయవంతం చేయండి

**శ్రీరంగాపూర్, మే20 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం హక్కుల సాధనకై ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించ తలపెట్టిన జనభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం శ్రీరంగాపూర్ రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జనభేరి బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచాలామాట్లాడుతూ గత 15 ఏళ్లుగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నామని గత ప్రభుత్వంలో ఎన్నో అక్రమ కేసులు పెట్టిన కూడా వాటిని ధైర్యంగా ఎదుర్కొని అనేక ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇటీవల వనపర్తి జిల్లాలో చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. వనపర్తి జిల్లాలోని అన్ని మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు జనభేరి సభలో ప్రస్తావిస్తామన్నారు. సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికిపంపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జనభేరి సభలో కృతజ్ఞతలు తెలుపుతామన్నారు. జనభేరి సభలో ప్రముఖ జానపద కళాకారులు జంగిరెడ్డి, జానులిరి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్యయాదవ్, మండల అధ్యక్షులు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కాని రమేష్, రాష్ట్రకార్యదర్శి వీవిగౌడు, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కొత్తకోట మండలఅధ్యక్షుడు అంజన్న యాదవ్, బాలచం ద్రయ్య, రవి సాగర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

**పెబ్బేరు, మే20ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని పాఠశాలలో ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంఈఓ ఎస్ జయరాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, మారుతున్న కాలాను గుణంగా పాఠ్యాంశంలో వచ్చేటువంటి మార్పులకు అను గుణంగా ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఉపాధ్యాయులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, ఇక్కడ నేర్చుకున్నటువంటి విషయాలను పాఠశాలలో అమలు చేయాలని తెలియజేశారు. విద్యార్థుల్లో ఉన్నటువంటి సృజ నాత్మక అంశాలను వెలికి తీయాలని, విద్యార్థులకు పాఠశాల విద్యలో ఉన్నటువంటి నైపుణ్యాలు నేర్పించాలనితెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠ్యాంశాల ఎమ్మార్పీలు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని చౌకధర దుకాణాల డీలరును రద్దు చేయాలి

**మాగనూరు, మే20 ప్రభాతవార్త:** క్రమంగా ప్రజల యొక్క బియ్యాన్ని తప్పుదోవ పట్టిస్తున్నటువంటి డీలర్లపై వెంటనే చట్టపరమైన చర్య తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి అన్ని చౌకధర దుకాణాలు దగ్గర ఒక్క రోజు నుండి 15 రోజుల వరకు వేయాల్సిన బియ్యాన్ని కేవలం వారికి అనుకూలంగా నాలుగు రోజులు సంత లాగా మార్చినటు డీలర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదేవిధంగా ప్రజలకు సక్రమంగా నాణ్యమైన బియ్యాన్ని అందించాల్సిందిగా డిమాండ్ చేస్తూ అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నటువంటి డీలర్స్ పైన వెంటనే చర్య తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బాలరాజు, రాఘవేంద్ర, పెద్ద నర్సింలు తదితరులు పాల్గొన్నారు.